క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎంఈఓ

హిందూపురం: మండలంలోని పూలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం తహసీల్దార్ శివప్రసాదరెడ్డి, ఎంఈఓ గంగప్ప తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థులకు గుడ్లు, చిక్కీలు ఇవ్వకపోవడాన్ని వారు గుర్తించారు. రోజూ గుడ్లు, చిక్కీలు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఉపాధ్యాయులు, హాజరు పట్టికలను పరిశీలించారు.

చేపల చెరువు వేలం



వేలం పాటలో పాల్గొన్న వ్యాపారులు

అమరాపురం: అమరాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో చేపల చెరువుకు వేలం పాట నిర్వహించారు. ఇందులో అమరాపురం గ్రామానికి చెందిన జోగింద్ర రూ.6.9 లక్షలకు వేలం పాడి చెరువును దక్కించుకున్నారు. అదే విధంగా దినసరి సంతను పిఆర్.మంజునాథ రూ.60,100 లకు పాట పాడి దక్కించుకున్నట్లు ఈఓ భాస్కర్ తెలిపారు. శుక్రవారం నుంచి వచ్చే ఏడాది మే నెల వరకు జోగింద్ర, మంజునాథకు పూర్తి హక్కులు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేలం పాటదారులు, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్ఎంకు సన్మానం



విశ్రాంత ప్రధానోపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని తిలక్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు విశ్వేశ్వరయ్యను ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్పతో పాటు ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా విశ్రాంత డీఈఓ రవీంద్రనాథ్, చిలమత్తూరు, పరిగి ఎంఈఓలు పద్మప్రియ, లక్ష్మీదేవి, విశ్రాంత ఎంఈఓ సుధాకర్‌రావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుకొండ: పెనుకొండ మున్సిపల్ పరిధిలోని పరమేశ్వరపురం-దొడ్డికుంట తండా వద్ద 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఐచర్ ఢీకొనింది. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. సోమందేపల్లిలోని మారుతీనగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డి, గీతానగర్‌కు చెందిన రామాంజనేయులు ద్విచక్ర వాహనంపై పెనుకొండ నుంచి వెళ్తుండగా, వేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొనింది. దీంతో శ్రీనివాసరెడ్డి తలకు బలమైన గాయమైంది. రామాంజనేయులు ముఖానికి స్వల్ప గాయాలయ్యాయి. ఐచర్ డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా వెళ్లిపోయాడు. గాయపడిన శ్రీనివాసరెడ్డి, రామాంజనేయులును అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి సోమందేపల్లి వాసులు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు క్రమశిణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ సర్పంచ్ చంద్రప్ప కోరారు. శుక్రవారం పాఠశాల విద్యార్థినులకు విద్యా సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థం అయ్యేలా పాఠాలు బోధించి మంచి ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. విద్యార్థినుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ, ఉపాధ్యాయురాళ్లు, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందలే..

- ఖరీఫ్ సీజన్‌లో రైతులను వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు
- పెరిగిన పెట్టుబడి భారం
- పంటల సాగుకు అప్పుల పాలవుతున్న అన్నదాతలు
- గత ఐదేళ్లలో రూ.287.71 కోట్ల పెట్టుబడి సాయం అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేసుకుంటున్న రైతు

మడకశిర: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. రూ.20 వేల చొప్పున రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల సందర్భంలో టీడీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన టీడీపీ.. వైఎస్సార్ రైతు భరోసా పథకం పేరు కూడా మార్చింది. అన్నదాత సుఖీభవ పథకంగా నామకరణం చేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద పెట్టుబడి సాయం కింద రూ. 2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకూ ఆ ఎటువంటి ప్రకటన చేయలేదు. తన వాటాను రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. రైతులు పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని జమ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో రైతులకు రూ.20 వేలు ఇస్తామని ఊదరగొట్టిన టీడీపీ.. నేడు రైతులను విస్మరిస్తోంది. ప్రభుత్వం పంటల సాగుకు పెట్టుబడి ఇవ్వకపోతే అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి భారం

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెట్టుబడి భారం మరింత పెరిగింది. ఈ భారాన్ని రైతులు భరించలేక పోతున్నారు. ముఖ్యంగా ట్రాక్టర్ అద్దెలు భారీగా పెరిగాయి. పెరిగిన కూలీల భారాన్ని రైతులు భరించలేకపోతున్నారు. రైతులు తమ భూములను దుక్కి దున్ని చేసుకోవడానికి ట్రాక్టర్ అద్దెను గంటకు రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ట్రాక్టర్ అద్దెను గంటకు రూ.700 తీసుకునే వారు.ప్రస్తుతం ఈ అద్దె రూ.1000 పెరగడంతో రైతులకు అదనపు భారం పడింది. అదే విధంగా దుక్కిదున్ని చేసిన వ్యవసాయ భూములను ట్రాక్టర్లలో చదును చేయడానికి రోటావేటర్‌కు గంటకు రూ.1,200 రైతులు చెల్లించాల్సి ఉంది. గతంలో ఈ అద్దె రూ.800 ఉండేది. ఈ విధంగా వ్యవసాయ పనులు చేయడానికి ట్రాక్టర్ల అద్దె కూడా భారీగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా కూలీ ఖర్చులు కూడా భారీగా పెరగాయి. ఏడాది క్రితం మగ కూలీకి రోజుకు రూ.300 చెల్లించే వారు. ప్రస్తుతం రూ.500 చెల్లించాల్సి ఉంది. ఆడ కూలీకి రోజుకు ఏడాది క్రితం రూ.200 చెల్లించే వారు. ప్రస్తుతం రూ. 300 చెల్లించాల్సి ఉందని రైతులు చెబుతున్నారు.

ఏటా సాయం అందించిన వైఎస్ జగన్

వైఎస్ జగన్ హయాంలో రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద ప్రతి ఏడాది క్రమం తప్పకుండా పెట్టుబడి సాయం అందింది. 5 ఏళ్లలో నియోజకవర్గంలోని రైతులకు రూ.287.71 కోట్ల పెట్టుబడి సాయం అందజేసింది. దీంతో రైతులు ఇబ్బందులు పడకుండా ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకున్నారు. నియోజకవర్గంలోని 45,763 మంది రైతులకు ప్రతి ఏడాది రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకుంది.

ఊపందుకోని వ్యవసాయ పనులు

నియోజకవర్గంలోని రైతులను ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు ఆశించిన స్థాయిలో ఊపందుకోలేదు. ప్రధానంగా వేరుశనగ పంట సాగు నామమాత్రంగానే ఉంది. ఇతర పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే ఉంది. వేరుశనగ పంట సాగుకు జూలై 15 వరకే గడువు ఉంది. వర్షం వచ్చినా చాలా మంది రైతులు ఆర్థిక ఇబ్బందులతో వేరుశనగ సాగు చేయలేక పోతున్నారు. వేరుశనగ పంట సాధారణ సాగు విస్తీర్ణం దాదాపు 27 వేల హెక్టార్లు. ఇంత వరకు 5 వేల హెక్టార్లలో పంటలు సాగు కాలేదు.

పెట్టుబడి సాయం అందించాలి



ఖరీఫ్ వ్యవసాయ సీజన్ మొదలైంది.వివిధ పంటల సాగుకు పెట్టుబడి ఎంతో అవసరం.ప్రస్తుతం పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నాం.వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.అధిక వడ్డీ చెల్లించి పంటల సాగుకు పెట్టుబడి పెడుతున్నాం.రాష్ట్ర ప్రభుత్వం ఈవిషయాన్ని గుర్తించి వెంటనే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– నాగేగౌడ్, దేవగానపల్లి, అమరాపురం మండలం

గత 5 ఏళ్లు సాఫీగా సాగిన వ్యవసాయం



గత 5 ఏళ్లలో వ్యవసాయం సాఫీగా సాగింది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో పెట్టుబడి సాయం ప్రతి ఏడాది సకాలంలో అందింది. ఫలితంగా ఖరీఫ్ వ్యవసాయానికి పెట్టుబడి సమస్య రాలేదు. అప్పులు చేయకుండా వ్యవసాయ పనులు చేసుకున్నాం. అయితే ఈ ఏడాది ఇంత వరకు పెట్టుబడి సాయం అందలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలి.

– శ్రీనివాస్, హెచ్‌టీ హళ్లి, రొళ్ల మండలం

శ్రీరామిరెడ్డి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: మండలంలోని ఎల్‌జీబీనగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీరామిరెడ్డి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సర్వసభ్య సమావేశం 3వ తేదీకి వాయిదా

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం జరగాల్సిన సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని జులై 3వ తేదికి వాయిదా వేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలు తీసుకుని రావాలని సూచించారు.

ఇంటి పట్టాలిచ్చే వరకూ పోరాటం



ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన సీపీఐ నాయకులు

లేపాక్షి: మండల కేంద్రానికి సమీపంలో ఇళ్లులేని నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని, పేదలు వేసుకున్న స్థలాలకు పట్టాలు ఇచ్చేవరకూ సీపీఐ ఆధ్వర్యంలో పోరాడతామని ఆ పార్టీ మండల కార్యదర్శి శివప్ప అన్నారు. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న వీకే ఆదినారాయణరెడ్డి కాలనీలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి నివాసాలు ఉండడానికి ఇళ్లల్లో పాలు పొంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసికెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. పేదలు వేసుకున్న స్థలాల్లోనే పట్టాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ధాన్ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం



వార్షిక నివేదికను విడుదల చేస్తున్న దృశ్యం

పావగడ: సమూహాల ద్వారా స్వ సహాయ సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా ఆర్థిక సహకారం అందించిన ధాన్ ఫౌండేషన్ సంస్థ సేవలు ఆదర్శనీయమని స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ అరుణ్ కుమార్ కొనియాడారు. స్థానిక అంధ్రగిరి భవనంలో శుక్రవారం నిర్వహించిన మహిళా కళంజియం, తాలూకా చెరువుల జల సంవర్ధన వయలగం సంఘాల 20వ సర్వసభ్య వార్షిక సభలో ఆయన మాట్లాడారు. మహిళా సాంత్వన కేంద్రాల ప్రతినిధి అనిత మాట్లాడుతూ.. మహిళలపై నిత్యం జరుగుతున్న దౌర్జన్యం, అన్యాయాలను ఎలా ఎదుర్కోవాలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వ సహాయ సంఘాల ద్వారా రుణాలు పొంది ఆర్థికాభివృద్ధి సాధించిన తీరును పలువురు సభ్యులు వివరించారు. అనంతరం వార్షిక నివేదికను విడుదల చేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ అనిల్ కుమార్, కళంజియం అధ్యక్షురాలు రత్నమ్మ, లక్ష్మీనరసమ్మ, గుండమ్మ, డైరెక్టర్లు రామచంద్రయ్య, నారాయణప్ప, అశ్వర్థప్ప, హెచ్.నాగేశ్, ధనుంజయ, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ: కరవు కాటకాలతో అల్లాడి పోతున్న రైతన్నల సమస్యలు పరిష్కరించాలని స్థానిక తాలూకా కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూముల్లేని రైతులకు ప్రభుత్వ పరంబోకు భూములు ఇవ్వలేదని ఆరోపించారు. రైతులకు సరైన సమయంలో ఖాతాలు, పాస్ పుస్తకాలు అందిచడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని మండిపడ్డారు. రైతుల భూములకు సరైన రోడ్లు లేక పోవడంతో సంచరించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తు చేశారు. అదే విధంగా పట్టణ ఆస్పత్రితో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో వైద్యులు లేక పేద రోగులు చికిత్స పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రైతులు, ప్రజల సమస్యలు తీర్చకుంటే వచ్చే నెల 13న పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు రైతు, ప్రజా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి పాటుపడదాం

- బీసీ సంక్షేమ, జౌళీశాఖ మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ: రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరి సహకారంతో అభివృద్ధికి పాటుపడుదామని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళిశాఖామంత్రి సవిత పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఉమర్‌ఫారూక్ అధ్యక్షతన నగర పంచాయతీ సమావేశం జరిగింది. ఎక్స్ అఫీషియో మెంబర్‌గా సమావేశంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ పెనుకొండ అభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడుతానన్నారు. చైర్మన్ ఉమర్‌ఫారుక్‌ఖాన్ మాట్లాడుతూ పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా బటర్‌ఫ్లై లైట్లు వేయించాలని, జగనన్న కాలనీలో నీటి సమస్య పరిష్కరించాలని, ఎన్‌టీఆర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు వేయించాలని, కోనాపురం రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు వైస్‌చైర్మన్ సునీల్, సుధాకరరడ్డి, తయూబ్, రఘునాథరెడ్డి, సద్దాం, శేషాద్రి, నాగరత్న, రామాంజనేయులు, బోయ హారతి, లావణ్య, షబిహానా, ఫర్జియాబాను, సంజీవమ్మ, భాస్కర్‌నాయక్, అంజలి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పాల ధరలు వెంటనే పెంచాలి

హిందూపురం: పాల సరఫరాకు పూర్తిస్థాయిలో మార్కెట్ కల్పిస్తూ రైతులు వేసే పాలకు వెంటనే లీటర్‌కు అదనంగా రూ.5 ఇస్తూ పెరిగిన ఎరువులు, పశువుల దాణా ధరలు తగ్గించాలని ఏఐకేకేఎంఎస్ జిల్లా నాయకుడు రంగనాయకులు కోరారు. శుక్రవారం ఏఐకేకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఏఓ సురేంద్ర కుమార్ నాయక్‌కు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, సంజీవరాయప్ప తదతరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థులకు చాంపియన్‌షిప్



బహుమతులు సాధించిన విద్యార్థులు

పెనుకొండ: ఉత్తర ప్రదేశ్‌లో అబాకస్ అకాడమీ నిర్వహించిన ఇంటర్నేషనల్ అబాకస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని శాంతినికేతన్‌కు చెందిన విద్యార్థులు ఛాంపియన్‌షిప్ సాధించినట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థిని జ్యోతిప్రియ, 5వ తరగతి విద్యార్థి ధీరజ్‌ప్రీనందన్ ఛాంపియన్‌షిప్ సాధించారన్నారు. మిగిలిన విద్యార్థులు బహుమతులు పొందినట్లు ఆయన తెలిపారు.

ఉపాధి పనులపై గ్రామసభ



విద్యార్థులకు భోజనం వడిస్తున్న తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ గంగప్ప

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ అధికారులు మాట్లాడుతూ.. గత ఏడాది నుంచి నిర్వహించిన ఉపాధి హామీ పనులను పరిశీలించామన్నారు. వివిధ పనుల్లో జరిగిన లోపాలను గుర్తించి గ్రామసభలో వెల్లించినట్లు తెలిపారు. తమ్మడేపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు వాటి ఖర్చులను వివరించారు. కార్యక్రమంలో సచివాలయం అధికారులు, కూలీలు, రైతులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన



డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: డయేరియాతో ప్రాణాపాయం ఉంటుందని, కలుషిత నీటితో ఇలాంటి ప్రమాదం కలుగుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా వ్యాప్తి, నివారణ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుహాసినమ్మ, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షల నిర్వహణ..

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యారోగ్య అధికారుల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఉన్న గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా గర్భిణులకు రక్తహీనత, ఎత్తు, బరువు, కడుపులోని శిశువు పరిస్థితి, హిమోగ్లోబిన్ శాతం తదితర అంశాలపై వైద్య పరీక్షలను నిర్వహించి, మందులు అందించారు.

సంఘాల బలోపేతానికి కృషి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐకేపీ ఏపీఎం తిప్పన్న పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో హేమ మండల అధ్యక్షురాలు లలితమ్మ అధ్యక్షతన వీఓఏల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం తిప్పన్న సీసీలు మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళా సంఘాల పుస్తకాల నిర్వహణ, ఎంబుక్ కీపింగ్, స్త్రీనిధి రుణాలు, బ్యాంకు రుణాల మంజూరు, రికవరీ తప్పక నిర్వహించాలన్నారు. అలాగే వెనుకబడిన సంఘాలకు రుణాలు అందించి చిన్న చిన్న వ్యాపారాలు, పాడి ఆవుల పెంపకం పోషణ, తదితర వాటిపై దృష్టి సారించేలా చూడాలన్నారు. తద్వారా ఆర్థికంగా మహిళా సంఘాల సభ్యులు ఎదుగుతారన్నారు. అలాగే పిల్లలను బాగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని వీఓఏలు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని బాలయేసు కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సమావేశం నిర్వహించి, శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కాకినాడలో జూలై 8, 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహమూర్తి, నాయకులు పవన్, గోపి, మంజునాథ్, అబ్రహం, అనిల్, హేమంత్, మహేష్‌బాబు, సాజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని బస్సులను సీజ్ చేయండి

మడకశిర: నియోజకవర్గంలో కొన్ని ప్రైవేట్ సంస్థలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా బస్సులను నడుపుతున్నారు. ఇలాంటి బస్సులను గుర్తించి వెంటనే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ కోరారు. శుక్రవారం స్థానిక నాయకులు నరేంద్ర, ఆది తదితరులతో కలిసి పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందకుండా బస్సులు నడపడం చాలా ప్రమాదకరమన్నారు. విద్యార్థుల ప్రాణాలతో యాజమాన్యాలు చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అద్దె బకాయిలు చెల్లించాలని ధర్నా

మడకశిర: ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా తీసుకున్న వాహనాలకు వెంటనే అద్దె చెల్లించాలని డ్రైవర్లు కోరారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివిధ వాహనాల డ్రైవర్లు ధర్నా చేశారు. ఇప్పటి వరకూ కేవలం రూ.2 లక్షలు మాత్రమే అద్దె చెల్లించడం జరిగిందన్నారు. మిగిలిన అద్దె బకాయిలు దాదాపు రూ.5 లక్షల వరకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఎన్నికలు జరిగి రెండు నెలలు కావస్తున్నా అధికారులు వాహనాల అద్దెను చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులను అడిగినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులుకు వినతిపత్రం అందించి న్యాయం చేయాలని కోరారు.

తుమ్మల మారెమ్మకు పూజలు

గుడిబండ: పట్టణ సమీపంలో వెలసిన తుమ్మల మారెమ్మ దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల ప్రతిమకు భక్తులు తీసుకువచ్చిన పట్టు వస్త్రాలు, గాజులు, పూలతో అలంకరించారు.

కొల్హాపురి మహాలక్ష్మీ దేవి ఆలయాల్లో పూజలు

రొళ్ల: మండలంలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ దేవి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు చేపట్టారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం చేశారు. భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, గాజులతో పాటు వడిబియ్యాన్ని అమ్మవారికి కట్టి పూలతో అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే కొత్తపాళ్యం వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు నియోజకవర్గం నలుమూల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వినియోగం, అన్నదానం చేశారు.

అంతరిస్తున్న పచ్చదనం



చెట్లను నరికి దుంగలను తరలిస్తున్న దృశ్యం

మడకశిర: నియోజకవర్గంలో పచ్చదనం అంతరిస్తోంది. ఇష్టానుసారంగా చెట్లను నరికేస్తుండటంతో పర్యావరణం కలుషితం అవుతోంది. పట్టా భూముల్లో ఉన్న చెట్లను నరకడానికి కూడా తప్పనిసరిగా అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కొంత మంది ఎలాంటి అనుమతి తీసుకోకుండానే పచ్చని చెట్లను నేల కూలుస్తున్నారు. చెట్లను నరికిన అనంతరం చిన్నగా కట్ చేసిన దుంగలను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. మడకశిర నియోజకవర్గం నుంచి రోజూ హిందూపురం ప్రాంతానికి కలపను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పచ్చని చెట్లను కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు చోద్యం చూస్తుండటంతో కరువుకు నిలయమైన మడకశిర ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అమ్మవారిపల్లిలో స్థల వివాదం



దాడిలో గాయపడిన సుబ్బరాయుడు

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లి గ్రామంలో స్థల వివాదంలో సుబ్బరాయుడు, ఓంకృష్ణ ఓబులేసు పరస్పరం దాడి చేసుకున్నారు. దాడిలో గాయపడిన సుబ్బరాయుడు కియా పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించండి

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేద గ్రామీణ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు హఫీజ్, నరసింహమూర్తి తదితరులు మంత్రి సవితను శుక్రవారం కోరారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేక మంది పేద విద్యార్థులు మధ్యాహ్నం వేళ భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

భోజన వసతుల తనిఖీ

హిందూపురం: పట్టణంలోని కస్తూరి బా పాఠశాలను తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ గంగప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో గదులు, బోధన పరిస్థితులు పరిశీలించారు. అలాగే విద్యార్థినులు, ఉపాధ్యాయుల హాజరు, వసతులు, నీటి సౌకర్యాలు, బోధన తదతర విషయాలను వారు ఆరా తీశారు.